క్లుప్తంగా

పతంగుల విహంగంలో జాగ్రత్తలు తప్పనిసరి

గురజాల : సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకుని గాలి పటాలు ఎగురవేసే సమయంలో పలు జాగ్రత్తలు పాటించాలని విద్యుత్ శాఖ ఏఈ మస్తాన్ వలి సూచించారు. తన కార్యాలయంలో శనివారం ఆయన పలు సూచనలు చేశారు. విద్యుత్ తీగలపై పడిన పతంగులను జాగ్రత్తగా తీయాలని, తొందరపడొద్దని హెచ్చరించారు.

నేడు వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణ మహోత్సవం

దుర్గి: మండల కేంద్రంలోని శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయ 70వ వార్షికోత్సవం సందర్భంగా కల్యాణ మహోత్సవాలకు గ్రామస్తులు పూర్తి ఏర్పాట్లు చేశారు. ఆదివారం మంగళ వాయిద్యాలతో సుప్రభాత సేవ, అభిషేకం, స్వామి వారి కల్యాణం, నంది వాహన సేవ, ముగ్గుల పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు.

కోడి పందేలు నిర్వహిస్తే కఠిన చర్యలు



మాచర్ల రూరల్: సంక్రాంతి పండగ నేపథ్యంలో గ్రామాల్లో కోడి పందేలు, పేకాట ఇతర జూదాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని రూరల్ ఎస్ఐ కె.రాజశేఖర్ హెచ్చరించారు. శనివారం రూరల్ పోలీసు స్టేషన్ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు పోలీసు స్టేషన్ పరిధిలో పలు గ్రామాల్లో ప్రత్యేక నిఘా వ్యవస్థను ఏర్పాటు చేశామన్నారు. గ్రామాల్లో రాజకీయ చర్చలు, పార్టీలతో కూడిన ప్రచారాలు చేయటం పూర్తిగా నిషేధమన్నారు.

రూ.19 లక్షల నిధులతో అభివృద్ధి పనులు

శావల్యాపురం: మండలంలోని మతుకుమల్లి గ్రామంలో ఉపాధి నిధులు రూ.17 లక్షలతో నూతనంగా సిమెంట్ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించినట్లు పంచాయతీ రాజ్ ఏఈ ఎ.వెంకటేశ్వరస్వామి శనివారం తెలిపారు. పనులు శనివారం పరిశీలించారు. ఏఈ మాట్లాడుతూ స్థానిక ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు సారథ్యంలో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టామన్నారు. గ్రామంలోని ఎస్సీ కాలనీలో 100 మీటర్ల మిగిలిన 220 మీటర్ల వివిధ ఏరియాలో రోడ్డు పనులు పారదర్శకంగా చేస్తున్నట్లు వివరించారు. అలాగే శావల్యాపురం పోలీసు స్టేషను సమీపంలో బీసీ కాలనీలో పంచాయతీ నిధులు రూ. 2 లక్షలతో సీసీ డ్రైన్స్ నిర్మాణ 60 మీటర్ల మొర ప్రారంభించామన్నారు. ఆయనతో పాటు సర్పంచులు యలగాల బసవయ్య, యాగసిరి చెన్నమ్మ, సచివాలయ ఇంజినీరు సహాయకులు బసవరాజు పాల్గొన్నారు.

ఈవీఎం పనితీరుపై అవగాహన

శావల్యాపురం: మండలంలోని శానంపూడిలో పోలింగ్ కేంద్రాల్లో ఈవీఎం ఓటింగ్ యంత్ర పరికరాలపై ప్రజలకు ఇరు పార్టీల నాయకులకు శనివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డెప్యూటీ తహసీల్దార్ పి.నాసరయ్య మాట్లాడుతూ రానున్న అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో పోలింగ్ యంత్ర పరికరాలపై ప్రజలకు అవగాహన కోసం అన్నీ గ్రామాల్లో నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో సర్పంచి ఎం.శ్రీనివాసరావు, వైస్ ఎంపీపీ సీహెచ్ రంగారావు, ఏఎస్ఓ చెన్నయ్య, వీఆర్వో శ్రీనివాసరావు పాల్గొన్నారు.

నేడు పూర్వ విద్యార్థుల సమ్మేళనం

చిలకలూరిపేట: ఎస్‌సీవీఎస్ జూనియర్ కళాశాల, డీఆర్ఎన్ ఎస్‌సీవీఎస్ డిగ్రీ కళాశాల పూర్వ విద్యార్థుల సమావేశం ఆదివారం నిర్వహించనున్నట్లు పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు తాళ్ల అంజిరెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని ఆర్‌వీఎస్ సీవీఎస్ హైస్కూల్ ప్రాంగణంలో సమావేశం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం వరకు కొనసాగుతుందని చెప్పారు. కళాశాల ప్రారంభమైన 1974 నుంచి ఇప్పటి వరకు రెండు కళాశాలల్లో చదువుకున్న విద్యార్థులు అందరూ హాజరుకావాలని కోరారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు.

రేపు దింతెనపాడు చరిత్ర పుస్తకం ఆవిష్కరణ

యడ్లపాడు: మకర సంక్రాంతి పర్వదినాన మండలంలోని దింతెనపాడు గ్రామ చరిత్ర గ్రంథాన్ని ఆవిష్కరించనున్నట్లు గ్రంథ రచయిత, హేతువాద సంఘ జాతీయ కార్యదర్శి మేడూరి సత్యనారాయణ శనివారం తెలిపారు. పదో శతాబ్దపు భద్రకాళి, జంటసర్పాలు, పోతురాజు, వీరగల్లు, 11వ శతాబ్దపు దండేశ్వరస్వామి, చెన్నమల్లేశ్వర స్వామి శైవవైష్ణవ పురాతన ఆలయాలు తదితర గ్రామం యొక్క వెయ్యేళ్ల చరిత్రను ఇందులో పొందుపరిచామన్నారు. అగ్రహారం నుంచి గ్రామం ఆవిర్భవమైన అన్ని వివరాలను భావితరాలకు తెలియజేయాలనే సంకల్పంతో వెలువరించినట్లు చెప్పారు. సోమవారం ఉదయం 10 గంటలకు ఏఎన్‌యూ విశ్రాంత రిజిస్ట్రార్ రావెల సాంబశివరావు దీనిని ఆవిష్కరించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో చరిత్ర, శాసన పరిశోధకులు అద్దంకి గ్రామానికి చెందిన జ్యోతి చంద్రమౌళి, సినీ, టీవీ నటులు డాక్టర్ చిట్టినేని లక్ష్మీనారాయణ, కవిరాజు సాహితీ సమితి అధ్యక్షులు ఆలోకం పెద్దబ్బయ్య పాల్గొంటారని చెప్పారు.

ఉత్సాహంగా ముగ్గుల పోటీలు



బహుమతులు ప్రదానం చేస్తున్న ఎస్ఐ అనంత కృష్ణ



ముగ్గులు వేస్తున్న మహిళలు

గురజాల : సంక్రాంతి ముగ్గులు సంస్కృతి, సాంప్రదాయాలకు చిహ్నాలని ఎస్ఐ బి.అనంతకృష్ణ పేర్కొన్నారు. పులిపాడు రోడ్డులోని సిరి హోమ్స్ ఆధ్వర్యంలో శనివారం సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎస్ఐ అనంత కృష్ణ ముగ్గుల పోటీల విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. బి.పూజ ప్రథమ బహుమతిగా గ్రైండర్, భ్రమరాంబ ద్వితీయ బహుమతిగా మిక్సీ , ప్రమీల తృతీయ బహుమతిగా రైసు కుక్కర్ గెలుచుకున్నారు. పాల్గొన్నవారికి ప్రోత్సాహక బహుమతులు అందించారు. న్యాయనిర్ణేతగా జి.అనిత వ్యవహరించారు. నగర పంచాయతీ వైస్ చైర్ పర్సన్ మన్నెం కన్యాకుమారి, కౌన్సిలర్ రవికుమార్, సిరి హోమ్స్ ఎండీ మాశెట్టి శివ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన ముగ్గుల పోటీలు



మొదటి బహుమతి ఫ్రిడ్జ్ అందజేత

పిడుగురాళ్ల: సంక్రాంతి పండగను పురస్కరించుకుని శనివారం పట్టణంలోని ఆక్స్‌ఫర్డ్ కాలనీలోని పల్నాడు ఓయాసిస్ వద్ద చింతలపూడి చారిటబుల్ ట్రస్టు, పల్నాడు హాస్పిటల్ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. మొదటి బహుమతిగా వి.శిరీషకు ఫ్రిడ్జ్, రెండవ బహుమతిగా కె.అఖిలకు ఎల్ఈడీ టీవీ, మూడవ బహుమతిగా నిర్మలారెడ్డికి గ్రైండర్‌తో పాటు కన్సోలేషన్ బహుమతులుగా పట్టు చీరలు పాల్గొన్న మహిళలకు అందజేశారు. భారత దేశం సమగ్రత అనే అంశంపై ముగ్గుల పోటీలు నిర్వహించారు. విజేతలకు చింతలపూడి శ్రీనివాసరావు, డాక్టర్ అశోక్‌కుమార్, రమ్య హారిక దంపతులు బహుమతులు అందజేశారు. మన్నెం పుల్లారెడ్డి జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం లింగాల ధనలక్ష్మి పర్యవేక్షించారు. ట్రస్ట్ సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

ముగ్గుల పోటీలు

పిడుగురాళ్ల: సంక్రాంతి పండగను పురస్కరించుకొని రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో శనివారం ముగ్గుల పోటీలు పట్టణంలోని వాసవీ కన్యకాపరమేశ్వరీ దేవాలయ ప్రాంగణంలో మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. గెలుపొందిన మహిళలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యకరమంలో రోటరీ క్లబ్ సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

సత్తా చాటిన ఒప్పిచర్ల క్రీడాకారులు



ఖోఖో విన్నర్స్ జట్టు, కారెంపూడి



వాలీబాల్ విన్నర్స్ జట్టు, ఒప్పిచర్ల

కారెంపూడి: ఆడుదాం ఆంధ్రా మండల స్థాయి క్రీడల్లో ఒప్పిచర్ల క్రీడాకారులు వాలీబాల్, ఖోఖో, కబడ్డీలో సత్తా చాటారని ఎంపీడీఓ జి.శ్రీనివాసరెడ్డి శనివారం తెలిపారు. వాలీబాల్‌లో మహిళలు, పురుషుల జట్లు విజేతలుగా నిలిచాయన్నారు. ఖోఖో, కబడ్డీలో ఒప్పిచర్ల మహిళల జట్లు విజయం సాధించాయని చెప్పారు. కారెంపూడి ఖోఖో పురుషుల జట్టు మండల విజేతగా నిలిచిందన్నారు. సంక్రాంతి పండగ మూడు రోజుల సెలవుల అనంతరం మిగతా క్రీడల్లో ఫైనల్స్ నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ శ్రీనివాసరెడ్డి తెలిపారు.

ధనుర్మాసం..దివ్య సమ్మోహనానందం



పట్టణంలోని వడ్డవల్లిలో స్వర్ణ అలంకారంలో శ్రీవారు



పెద్దమక్కెనలో ప్రత్యేక అలంకరణలో శివలింగం

సత్తెనపల్లి: ధనుర్మాసం పురస్కరించుకొని పట్టణంలోని ఆలయాల్లో శనివారం భక్తులు భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. వడ్డవల్లి శ్రీ రామాలయం వెంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రీవారికి స్వర్ణ, కోదండ రామస్వామికి శ్వేతవర్ణ అలంకరణలు గావించారు. రైల్వేస్టేషన్ రోడ్డులోని అలివేలు మంగ పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రీవారికి దివ్య సమ్మోహనానంద రూప అలంకరణ గావించారు. ఐదులాంతర్ల సెంటరులోని రుక్మిణి సత్య భామ సమేత వేణుగోపాలస్వామి, కట్టమూరివారి వీధిలోని కోదండ రామాలయం, పెద్దమక్కెన గంగా భ్రమరాంభ సమేత మల్లికార్జున స్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఆలయాల కమిటీలు ఏర్పాట్లను పర్యవేక్షించాయి.

ఘనంగా వేంకటేశ్వరస్వామి కల్యాణం



నకరికల్లు: ధనుర్మాసం పురస్కరించుకొని దేచవరం గ్రామంలో గోదాదేవి, మహలక్ష్మి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో కల్యాణ వేడుకలు శనివారం వైభవంగా నిర్వహించారు. ఆలయంలోని స్వామి, అమ్మవార్లను విశేషంగా అలంకరించారు. వేద పండితుల మంత్రోచ్ఛరణల నడుమ స్వామివారి కల్యాణ వేడుక కనుల పండువగా నిర్వహించారు. వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ భవనం రాఘవరెడ్డి కుటుంబ సమేతంగా పాల్గొన్నారు. స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

పట్నంబజారు: అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతిచెందిన సంఘటనపై కేసు నమోదైంది. కొత్తపేట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పల్నాడు జిల్లా పెదకూరపాడు గ్రామానికి చెందిన కంచర్ల విజయబాబు (40) ఈనెల 10న ఇంట్లో వారితో పురుగు మందులు తీసుకొస్తానని చెప్పి గుంటూరు వచ్చాడు. 11వ తేదీ ఉదయం గుంటూరువారితోటలోని మాధవి రెసిడెన్సిలో రూము తీసుకుని ఉన్నాడు. 12వ తేదీ సాయంత్రం అయినప్పటికీ తలుపులు తీయకపోవడంతో అనుమానం వచ్చిన లాడ్జి నిర్వాహకులు పోలీసులకు సమాచారం అందించారు. తలుపులు పగులగొట్టి లోపలకు వెళ్లి చూడగా విజయబాబు కిందపడి మృతిచెంది ఉన్నాడు. మృతికి గల కారణాలు తెలియరాలేదు. మృతుడి భార్య ప్రమీల ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

నేడు ముత్యాలమ్మ తిరుణాళ్ల



శ్రీముత్యాలమ్మ తల్లి మూలవిరాట్

రాజుపాలెం: కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి, భక్తుల పాలిటి కొంగు బంగారం ముత్యాలమ్మతల్లి. అనుపాలెం తూర్పు వైపున కొండపై కొలువుదీరిన అమ్మవారి తిరునాళ్లను ప్రతి సంక్రాంతికి ఘనంగా నిర్వహిస్తారు. ఆదివారం అమ్మవారి తిరునాళ్ల నిర్వహించేందుకు నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేశారు. పాడి పంటలు, భోగభాగ్యాలతో చల్లగా చూసే తల్లికి కులమతాలకు అతీతంగా తొలి ధాన్యపు కంకులు, పొంగళ్లు నైవేద్యంగా భక్తులు సమర్పిస్తారు. చీరా సారెలతో బోనాలు నెత్తిన పెట్టుకొని మొక్కులు తీర్చుకుంటారు. సాయంత్రం విద్యుత్ ప్రభలు, భజనలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. తిరుణాళ్లలో అవాంఛనీయ ఘటనలకు తావివ్వకుండా ఎస్ఐ షేక్ అమీరుద్దీన్ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు. ప్రభలపై రాజకీయ పార్టీల జెండాలు, ఫ్లెక్సీలు, అశ్లీల చిత్రాలు ప్రదర్శించవద్దని హెచ్చరించారు.

ఉచిత మినరల్ వాటర్ ప్లాంట్ ఏర్పాటు

వినుకొండ(నూజెండ్ల): స్థానిక ఆర్టీసీ డిపోలో అసిస్టెంట్ మేనేజర్ (పి)గా విధులు నిర్వహించిన ముండ్రు విజయరాజకుమార్ జయంతి సందర్భంగా ఆయన కుటుంబ సభ్యులు బస్టాండ్‌లోని ప్రయాణికుల తాగునీటి సౌకర్యార్థం ఉచిత మినరల్ వాటర్‌ప్లాంట్‌ను ఏర్పాటు చేశారు. డిపో మేనేజర్ బి.కోటేశ్వరరావునాయక్ రిబ్బన్ కట్ చేసి ప్లాంట్‌ను ప్రారంభించారు. అనంతరం డీఎం మాట్లాడుతూ బస్టాండ్‌లో ప్రయాణికుల తాగునీటి సౌకర్యం కల్పించిన విజయరాజకుమార్ కుటుంబసభ్యులను అభినందించారు.



రిపబ్లిక్ పరేడ్‌కు మేజర్ రాజు ఎంపిక



నరసరావుపేట ఈస్ట్: శ్రీసుబ్బరాయఅండ్ నారాయణ కళాశాల ఎన్‌సీసీ ఆఫీసర్ మేజర్ బీఎస్‌ఆర్‌కే రాజు ఈ నెల 26వ తేదీన న్యూఢిల్లీలో నిర్వహించనున్న రిపబ్లిక్ పరేడ్‌కు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సోము మల్లయ్య శనివారం తెలిపారు. మేజర్ రాజుతో పాటుగా ఎన్‌సీసీ క్యాడెట్ కొండెబోయిన ఏడుకొండలు కూడా రిపబ్లిక్ పరేడ్‌కు ఎంపికైనట్లు చెప్పారు. ఉభయ తెలుగు రాష్ట్రాల ఎన్‌సీసీ డైరెక్టరేట్ నుంచి ఎన్‌సీసీ ఆఫీసర్ మేజర్ రాజు ఎంపిక కావడం కళాశాలకే గర్వకారణమన్నారు. పరేడ్‌కు ప్రాతినిధ్యం వహించనున్న 130 మంది ఎన్‌సీసీ క్యాడెట్‌లకు మేజర్ రాజు నాయకత్వం వహిస్తారని తెలిపారు. ఎంపిక కావటంపై కళాశాల పాలకవర్గ అధ్యక్ష, కార్యదర్శులు కపలవాయి విజయ్‌కుమార్, నాగసరపు సుబ్బరాయగుప్తా హర్షం వ్యక్తం చేశారు.

సీఆర్ కళాశాలలో సంక్రాంతి వేడుకలు

నాదెండ్ల: మండలంలోని అన్ని గ్రామాల్లో సంక్రాంతి సంబరాలు ఉత్సాహంగా సాగుతున్నాయి. ఇప్పటికే విద్యాసంస్థలు, వాణిజ్య కార్యాలయాల్లో ముందస్తు వేడుకలు నిర్వహించారు. పలు గ్రామాల్లో ఆది, సోమ, మంగళవారాల్లో రంగవల్లుల పోటీలు నిర్వహణకు ఏర్పాట్లు చేశారు. గణపవరంలోని కోదండ రామాలయంలో ఆదివారం మధ్యాహ్నం 3 గంటలకు దేవస్థాన కమిటీ ఆధ్వర్యంలో రంగవల్లుల పోటీలు నిర్వహించనున్నారు. ఆదివారం ఉదయం భోగి మంటలు వేయనున్నారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులతో పాటూ మరో 10 మందికి కన్సొలేషన్ బహుమతులు అందజేయనున్నట్లు పేర్కొన్నారు.

లింగారావుపాలెంలో సంక్రాంతి సంబరాలు

యడ్లపాడు: మండలంలోని లింగారావుపాలెంలో భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య(డీవైఎఫ్ఐ) 44వ సంక్రాంతి క్రీడా సంబరాలు శనివారం ప్రారంభమయ్యాయి. రన్నింగ్, క్రికెట్, వాలీబాల్, సైకిల్ స్లో, షటిల్, క్విజ్, వక్తృత్వం, వ్యాసరచన, కుండకొట్టుడు, మోకులాగుడు, రంగవల్లులు, మ్యూజికల్‌చైర్స్, ఫన్నీగేమ్స్ పోటీలు నిర్వహించనున్నారు. 14వ తేదీన మద్దుకూరి ఆర్ట్స్ క్రియేషన్స్ (చిలకలూరిపేట) వారిచే మద్దుకూరి రవీంద్రబాబు రచనకు వై.భవాని దర్శకత్వం వహించిన 'మృత్యుపత్రం' సాంఘిక నాటిక ప్రదర్శన, అలాగే ఉత్సవాలు చివరిరోజైన 15వ తేదీ రాత్రి పలు సాంస్కృతిక ప్రదర్శనలు ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ఆయా కార్యక్రమాలను విజన్ ఫౌండేషన్, గ్రామ ఎన్ఆర్ఐ యువకులు, పెద్దలు సహకారంతో కొనసాగిస్తున్నట్లు చెప్పారు.

అపూర్వ సమ్మేళనం



యడ్లపాడు: పూర్వ విద్యార్థుల సమావేశం సందడిగా జరిగింది. మండల కేంద్రమైన యడ్లపాడు లూథరన్ ఉన్నత పాఠశాలలో పూర్వ విద్యార్థులు ఆత్మీక సమావేశం శనివారం నిర్వహించారు. 1990 –1995 మధ్య కాలంలో పాఠశాలలో ఆరో తరగతి నుంచి పదో తరగతి వరకు అభ్యసించిన విద్యార్థులు 110 మంది హాజరయ్యారు. తమ జ్ఞాపకాలు ఒకరినొకరి పంచుకుని మురిసిపోయారు. అప్పటి గురువులను సత్కరించారు. అనంతరం పూర్వ విద్యార్థులంతా సరదాగా పలు క్రీడా, సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఎంతో సంతోషంగా గడిపి ఆ మధుర స్మృతుల్ని మోసుకెళ్లారు.

రెంటచింతల ఎస్ఐ బాధ్యతల స్వీకరణ



ఎస్ఐ కె.వెంకట నారాయణరెడ్డి

రెంటచింతల: స్థానిక ఎస్ఐగా కె.వెంకటనారాయణరెడ్డి శనివారం బాధ్యతలు చేపట్టారు. పోలీస్ స్టేషన్‌లో విలేకరులతో ఈ సందర్భంగా మాట్లాడారు. గ్రామాల్లో కోడి పందేలు నిర్వహిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలపై ప్రత్యేక నిఘా పెట్టినట్లు తెలిపారు. వైఎస్సార్ సీపీ, సీపీఐ నాయకులు ఆయనను కలిసి, శుభాకాంక్షలు తెలియజేశారు.

విజయపురిసౌత్ ఎస్ఐగా వెంకట కొండారెడ్డి



ఎస్ఐ వెంకట కొండారెడ్డి



దుర్గి ఎస్ఐ కోటయ్య

విజయపురిసౌత్: నాగార్జున సాగర్, విజయపురిసౌత్ పోలీస్ స్టేషన్ నూతన ఎస్ఐగా డి.వెంకట కొండారెడ్డి శనివారం బాధ్యతలు స్వీకరించారు. 2018 బ్యాచ్‌కు చెందిన ఆయన బాపట్లలో ఎస్ఐగా పనిచేశారు. గత ఎస్ఐ పి.అనిల్ కుమార్‌రెడ్డి బదిలీపై డిస్ట్రిక్ట్ స్పెషల్ బ్రాంచ్‌కు వెళ్లారు. స్టేషన్ పరిధిలో శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేస్తానని ఎస్ఐ వెంకట కొండారెడ్డి అన్నారు. ఆయనకు పోలీస్ సిబ్బంది అభినందనలు తెలిపారు.

దుర్గి ఎస్ఐగా కోటయ్య బాధ్యతలు

దుర్గి: ఇటీవల సాధారణ బదిలీపై పిడుగురాళ్ల నుంచి వచ్చిన ఎస్ఐ కోటయ్య శనివారం స్థానిక పోలీసు స్టేషన్‌లో బాధ్యతలు స్వీకరించారు. పలువురు ప్రజా ప్రతినిధులు, నాయకులు ఆయనను కలిసి, శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం సిబ్బందితో ఆయన సమీక్షించారు.

చెరువులకు జలకళ



ఒప్పిచర్ల నల్ల చెరువు

కారెంపూడి: సాగర్ కుడి కాల్వకు మంచి నీటి విడుదలతో మండలంలో చెరువులు ఇప్పుడిప్పుడే జలకళ సంతరించుకుంటున్నాయి. సోమవారం నుంచి కారెంపూడి సబ్ డివిజన్ పరిధిలోని చెరువులకు పూర్తిస్థాయిలో నీటిని విడుదల చేయాలని ఉన్నతాధికారులు ఆదేశించారని ఓఅండ్‌ఎం కారెంపూడి సబ్ డివిజన్ ఏఈ బత్తిన నరేంద్ర శనివారం తెలిపారు. ప్రస్తుతం ఒంగోలు, నర్సరావుపేట ప్రాంతాలకు నీరు వెళ్తోందని.. అక్కడ చెరువులకు నీరు చేరుకోగానే పల్నాడు ప్రాంతంలోని చెరువులు నింపుకునేందుకు పూర్తిస్థాయి నీటి విడుదల చేయాలని ఆదేశాలున్నట్లు తెలిపారు. సాగర్ నీటి విడుదల 18న నిలిపివేసినా.. బుగ్గవాగు నుంచి 22వ తేదీ వరకు నీరు వచ్చే అవకాశం ఉందన్నారు. మంచినీటి అవసరాల కోసం ప్రతి చెరువును నింపాలన్నదే లక్ష్యమన్నారు. ప్రస్తుతం మేజర్ కాల్వల ద్వారా నీటి సరఫరా ఒక మోస్తరుగా కొనసాగుతోంది.

సంక్రాంతికి రహదారి రద్దీ



దాచేపల్లి : సంక్రాంతికి హైదరాబాద్ నుంచి స్వగ్రామాలకు భారీగా ప్రజలు వాహనాల్లో బయలుదేరారు. శనివారం అద్దంకి–నార్కెట్‌పల్లి హైవే వాహనాలతో రద్దీగా మారింది. ఏపీ సరిహద్దు గ్రామం పొందుగల వద్ద అధికారులు వాహనాల తనిఖీ చేపట్టారు. పండగ రోజు వాహనాల రద్దీ ఎక్కువగా ఉండటంతో రోడ్డు కిక్కిరిసింది. వాహనాల రాకపోకలకు అంతరాయం కలగటంతో ప్రయాణికులు కొంత ఇబ్బందులు పడ్డారు.

భార్య కాపురానికి రాలేదని భర్త ఆత్మహత్య

తెనాలిరూరల్: భార్య కాపురానికి రావడంలేదని భర్త ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. బాపట్ల జిల్లా చుండూరు మండలం వేటపాలెంకు చెందిన పొన్నాల సుబ్బారావు(34)కు స్థానిక పాండురంగపేటకు చెందిన శివపార్వతితో వివాహమైంది. భార్య కొంతకాలంగా కాపురానికి రావటం లేదు.దీంతో ఇరు కుటుంబాల వారు తరచూ గొడవపడుతుండేవారు. ఈ క్రమంలో శుక్రవారం రాత్రి అత్తింటికి వచ్చిన సుబ్బారావు భార్యను కాపురానికి రమ్మని గొడవపడ్డాడు. కాపురానికి వచ్చేందుకు భార్య నిరాకరించడంతో అత్తింట్లోనే రాత్రికి ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. శనివారం ఉదయం సమాచారం అందుకున్న త్రీ టౌన్ పోలీసులు మృతదేహాన్ని పరిశీలించి తెనాలి జిల్లా వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అత్తింటివారి తీరుపై మహిళ ఆందోళన

అత్తింటి వారు కాపురానికి రానివ్వడం లేదని ఓ మహిళ ఆందోళనకు దిగింది. తల్లిదండ్రులతో కలసి అత్తింటికి వచ్చి బాధితురాలు ఆందోళన చేసింది. బాధితురాలు, ఆమె తల్లిదండ్రులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పట్టణ ఐతానగర్‌కు చెందిన జరుగు సీతారాం, కోటేశ్వరి దంపతుల కుమార్తె రమ్యశ్రీకి బాలాజీరావుపేటకు చెందిన బర్మా రవికిషోర్‌కు ఐదేళ్ల క్రితం వివాహమైంది. వీరికి నాలుగేళ్ల కుమారుడు ఉన్నాడు. పెళ్లైన తర్వాత ఐదు నెలల గర్భిణిగా ఉన్న సమయంలో పుట్టింటికి వచ్చిన రమ్యశ్రీని తిరిగి కాపురానికి రానీయడం లేదని వారు ఆరోపించారు. వివాహ సమయంలో ఎకరం పొలం, రూ.10 లక్షల కట్నం ఇచ్చామని చెప్పారు. రవికిషోర్ తల్లిదండ్రులు శివనాగేశ్వరరావు, మాధవి, ఆడపడుచు తమ కుమార్తెను కాపురానికి రానివ్వడంలేదని, న్యాయం చేయాలని కోర్టును ఆశ్రయించామని తెలిపారు. తాము కాపురానికి తీసుకెళ్లమని అడుగుతుంటే రవికిషోర్ కుటుంబ సభ్యులు విడాకులు కోరుకుంటున్నారని చెప్పారు.

నేడు గోదా రంగనాయకస్వామి కల్యాణ వేడుకలు



రంగనాయక దేవాలయంలో ఉత్సవ మూర్తులకు పూజలు

యడ్లపాడు: ధనుర్మాసం ముగింపు సందర్భంగా గోదా రంగనాథుల కల్యాణ వేడుకలు నిర్వహించనున్నట్లు అర్చకులు పర్చూరి రామకృష్ణమాచార్యులు తెలిపారు. మండలంలోని సొలస గ్రామంలోని రంగనాయక స్వామి ఆలయంలో ధర్మకర్తలు అర్వపల్లి మనోహర్, నాగజ్యోతి, అర్వపల్లి సోదరులు నేతృత్వంలో ధనుర్మాసం ప్రారంభం నుంచి ప్రతిరోజు దేవతామూర్తులకు విశేష అలంకరణలు, ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ధనుర్మాసం చివరి రోజైన ఆదివారం ఉదయం 9 గంటలకు భోగి పండ్ల స్నానం, 9.30 గంటలకు అమ్మవారికి సారెతో ఊరేగింపు, 10 గంటలకు గోదాదేవి, రంగనాయకస్వామి కల్యాణ వేడుకలు ఉంటాయన్నారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలను పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. ఆయా కార్యక్రమాలను దేవస్థాన ఈఓ శివయ్య పర్యవేక్షించనున్నారు.

ఘనంగా భవ్యదంపతి పూజలు

వినుకొండ(నూజెండ్ల): ధనుర్మాసాన్ని పురస్కరించుకొని వినుకొండ పట్టణంలోని ఎన్ఎస్‌పీ కాలనీ గ్రౌండ్‌లో చిన్నజీయరు స్వామి నిలయం నిర్వాహకులు భవనాసి మల్లికాప్రసాద్ దంపతుల ఆధ్వర్యంలో భవ్యదంపతి పూజలు అహోబిలం రామానుజ స్వామి ఆశీస్సులతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీ లక్ష్మీదేవి అమ్మవారికి పసుపు పూజ చేశారు. పసుపును వచ్చిన భక్తులకు వాయినంగా స్వామి చేతుల మీదుగా అందజేశారు. లక్ష్మీనారాయణస్వామి ఆశీస్సులు భక్తులకు ఎల్లవేళలా ఉండాలని, అందరూ సుఖసంతోషాలతో ఉండాలనే ఉద్దేశంతో ఈ పూజా కార్యక్రమాలు చేశామని తెలిపారు.